# రైతులకు అరాకొరగా పంట రుణాలు

**రైతాంగానికి** పంట రుణాలు ఇవ్వటంలో పాలకుల మాటలకు పొంతనే వుండటంలేదు. ఏ సంవత్సరంలో కూడా ప్రకటించిన పంట రుణాలు పూర్తిగా ఇవ్వటంలేదు. ఒక సంవత్సరంలో ఇస్తామన్న మొత్తం రుణాల్లో మిగిలిన వాటిని కలిపి మరుసటి సంవత్సరం ఎక్కువ పంట రుణాలు కేటాయించినట్లు పాలకులు ప్రచారం చేసుకొంటున్నారు. ఇప్పటికీ కౌలు రైతులకు కంటితుడుపు రుణాలు కూడా అందటంలేదు. ప్రతి వ్యవసాయ సీజన్‌కు ముందు కౌలురైతులందరికీ రుణాలు అందిస్తామని ఆర్భాటపు ప్రచారం మాత్రం చేస్తున్నారు. ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చేవాటిల్లో 18 శాతం పంటరుణాలుగా ఇవ్వాలని రిజర్వుబ్యాంక్ ఆదేశాలు వున్నా, అది ఎప్పుడూ అమలు జరగలేదు. 17శాతం రైతులకు మించి రుణాలు అందటంలేదు. ఫలితంగా అత్యధిక రైతులు ప్రైవేట్ వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

ఈ వ్యవసాయ వార్షిక సంవత్సరంలో ఎప్పుడూ లేనివిధంగా వ్యవసాయరంగానికి 68 వేలకోట్ల రుణాలు యిచ్చేందుకు బ్యాంక్‌లను ఒప్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొన్నారు. ఖరీఫ్ పంట రుణాలు 36,580 కోట్లుగా ప్రకటించినా అది పూర్తిగా అమలుజరగలేదు. ఖరీఫ్ సీజన్ ముగిసినా కేటాయించిన రుణాలు 29,507 కోట్లు మాత్రమే. అంటే 7,073 కోట్లు ఇవ్వాల్సిన రుణాలు మిగిలివున్నాయి. వ్యవసాయ టర్మ్ రుణాలు 1,502 కోట్లు లక్ష్యంగా పెట్టినా యిచ్చింది 5,970 కోట్లు మాత్రమే. వ్యవసాయ పంటరుణాలు, టర్మ్‌రుణాల మొత్తం లక్ష్యం 48,082 కోట్లు కాగా 35,039 కోట్లు మాత్రమే మంజూరుచేశారు. లక్ష్యంలో 13,039 కోట్లు తక్కువగా వుంది.

రాష్ట్రప్రభుత్వం రైతుల వ్యవసాయ రుణాలను మాఫీచేస్తానని చెప్పటంతో అత్యధిక రైతులు బ్యాంక్ రుణాలు చెల్లించలేదు. రుణాల చెల్లింపు కాలపరిమితి దాటిపోవటంతో అపరాధపు వడ్డీని బ్యాంక్‌లు రుణాలకు వర్తింపచేశాయి. ఫలితంగా అసలుకు మించి వడ్డీ పెరిగింది. ప్రభుత్వం చేస్తానంటున్న రుణమాఫీ వడ్డీకే సరిపోకపోవటంతో రుణాలు చెల్లించనివారుగా రైతులు మిగిలిపోయారు. రైతులు రుణాలు చెల్లించలేదు కాబట్టి తిరిగి వారికి రుణాలు ఇవ్వబోమని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. రైతుల పరిస్థితి రెంటికి చెడ్డరేవడిలా తయారైంది. కౌలురైతులకు రుణాల మంజూరు అన్నది ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగానే వుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 5.76 లక్షలమంది రైతులకు రుణ అర్హతకార్డులు జారీచేయగా 41,729 మందికి మాత్రమే రుణాలు అందాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశంజిల్లాల్లో ఒక్క కౌలురైతుకి కూడా బ్యాంక్‌ల నుండి రుణాలు అందలేదు. వ్యవసాయ పంటల రుణ లక్ష్యం అమలుతీరు ఎలా వుందీ దీన్ని గమనిస్తే అర్థమౌతుంది.

ooooo